సాక్షి
నిర్మల్
బుధవారం । 18 । డిసెంబర్ । 2024



దొడ్డు రకానికే మొగ్గు

యాసంగిలో రైతులు దొడ్డు రకం వరి సాగుకే మొగ్గు చూపుతున్నారు. వానాకాలంలో సన్నాలు సాగు చేసి నష్టపోయినందునే వారు ఈ నిర్ణయం తీసుకుంటున్నారు. 9లో▸



శోభాయమానం.. ఆరట్టు..

భైంసా పట్టణంలో అయ్యప్ప ఆరట్టు ఉత్సవం శోభాయమానంగా జరిగింది. దీక్షాపరులు అధికసంఖ్యలో పాల్గొని ఉత్సవమూర్తితో ఊరేగింపు నిర్వహించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
28.0 / 13.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తీవ్రత పెరుగుతుంది. రాత్రి నుంచి ఉదయం వరకు పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

అసెంబ్లీలో రెవెన్యూ డివిజన్ ప్రస్తావన



మాట్లాడుతున్న బొజ్జు

ఖానాపూర్: ఖానాపూర్ ప్రజల చిరకాల కోరిక రెవెన్యూ డివిజన్ సమస్యను మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రస్తావించారు. గత ప్రభుత్వం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తామని అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సిద్దిపేట నుంచి ఖానాపూర్ నియోజకవర్గంలోని దస్తురాబాద్ మండలం గొడిసెర్యాల మీదుగా బస్సులు మళ్లించాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు.

నూతన మండలాల జాబితాలో చేర్చాలి



అసెంబ్లీలో మాట్లాడుతున్న రామారావుపటేల్

భైంసాటౌన్: ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 30 నూతన మండలాల జాబితాలో ముధోల్ నియోజకవర్గంలోని బెల్‌తరోడ, పల్సి, మాలేగాం పేర్లు చేర్చాలని ఎమ్మెల్యే రామారావుపటేల్ కోరారు. మంగళవారం నాటి అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం ఈ గ్రామాలను మండలాలుగా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించి విస్మరించిందని ఆరోపించారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో వీటి పేర్లు లేవని, వెంటనే చేర్చి నూతన మండలాలుగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పందిస్తూ.. విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.

విద్యార్థులు రోజూ హాజరయ్యేలా చూడాలి



అధ్యాపకులతో మాట్లాడుతున్న పరశురాం

భైంసాటౌన్: విద్యార్థులు కళాశాలకు ప్రతీరోజు హాజరయ్యేలా అధ్యాపకులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇంటర్‌విద్య జిల్లాధికారి పరశురాం సూచించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సిలబస్, రివిజన్‌పై పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం అధ్యాపకులతో సమావేశమై 90రోజుల ప్రణాళికపై పలు సూచనలు చేశారు. ఇంటర్ వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ శివరంజని తదితరులున్నారు.

కేసులు ఎత్తివేయాలి

నిర్మల్‌టౌన్: రైతులపై పెట్టిన కేసులను ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి రాంకిషన్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు మరుగొండ రాము డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద లగచర్లలోని రైతులపై కేసులు పెట్టి అరెస్ట్ చేయడంపై నిరసన తెలిపారు. లగచర్ల రైతులను కాపాడాలని కోరుతూ.. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నుంచి రాష్ట్రంలో రైతులపై అరాచకాలు పెరిగాయని, ప్రభుత్వం ఫార్మసీ కంపెనీలు తెచ్చి రైతులను ఆగం చేస్తోందని ఆరోపించారు. కనీసం అసెంబ్లీలో చర్చకూ సమయం ఇవ్వడం లేదని తెలిపారు. కేసులు వెంటనే ఎత్తివేయకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు సుభాష్‌రావు, పూదరి నరహరి, నెల్ల అనిల్, లక్ష్మణాచారి, రమణ, ఆర్కరి రాజేందర్, పోశెట్టి, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఏరియాస్పత్రిలో అసాంఘిక కార్యకలాపాలు!

భైంసాటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియాస్పత్రిలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆస్పత్రిలో పనిచేస్తున్న ఓ పారిశుధ్య కార్మికురాలు సోమవారం రాత్రి ఓ వ్యక్తిని ఆస్పత్రి గదిలోకి పిలిపించుకున్నట్లు తెలిసింది. ఈ విషయం అతడి భార్యకు తెలియడంతో ఆమె ఆస్పత్రికి చేరుకుంది. తన భర్త పారిశుధ్య కార్మికురాలితో గదిలో ఉండడం గమనించి ఆమెను బయటకు పంపింది. భర్తను గదిలోనే ఉంచి తాళం వేసింది. ఆమె అక్కడే బైఠాయించింది. అనంతరం ఆస్పత్రి సిబ్బంది తాళం తీయగా అతడు పరారైనట్లు సమాచారం. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్‌ను వివరణ కోరగా, అలాంటిదేమీ తమ దృష్టికి రాలేదని తెలిపారు.

చలి చంపేస్తోంది..!

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో కొద్దిరోజులుగా తగ్గుముఖం పట్టిన చలి గత మూడ్రోజులుగా మళ్లీ విజృంభిస్తోంది. జిల్లావాసులను గజగజా వణికిస్తోంది. మెల్లగా పగటి ఉష్ణోగ్రతలు కూడా తగ్గిపోవడంతో ప్రజలు చలి నుంచి ఉపశమనం పొందేందుకు చలిమంటలు వేసుకుంటున్నారు. ఉన్ని దుస్తులు ధరిస్తున్నారు. ఇక చలి కారణంగా రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. సోమవారం దస్తురాబాద్‌లో 16 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రోజుల్లో చలి మరింత పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. జనం అవస్థలపై 'సాక్షి' సోమవారం రాత్రి విజిట్ నిర్వహించింది.



జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్‌లో చలిమంట వేసుకున్న చిరువ్యాపారులు

- భారీగా తగ్గిన ఉష్ణోగ్రతలు
- దస్తురాబాద్‌లో అత్యల్పం..
- విశ్వనాథ్ పేటలో అత్యధికం
- అవస్థల్లో పిల్లలు, వృద్ధులు

సోమవారం రాత్రి జిల్లాలో ఉష్ణోగ్రతలు

మండలం	లొకేషన్	కనిష్ట ఉష్ణోగ్రత
దస్తురాబాద్	దస్తురాబాద్	16.0
కడెం పెద్దూర్	లింగాపూర్	16.3
మామడ	పొన్కల్	17.5
లోకేశ్వరం	లోకేశ్వరం	18.0
ఖానాపూర్	పాతఎల్లాపూర్	18.1
లోకేశ్వరం	అబ్దుల్లాపూర్	18.4
కడెం పెద్దూర్	కడెం పెద్దూర్	18.5
దస్తురాబాద్	బుట్టాపూర్	18.7
మామడ	మామడ	18.9
బాసర	బాసర	18.9
సోన్	పాక్‌పట్ల	19.1
పెంబి	పెంబి	19.9
నిర్మల్‌రూరల్	అక్కాపూర్	20.3

రోడ్లన్నీ నిర్మానుష్యంగా..

జిల్లాలోని దస్తురాబాద్‌లో 16 డిగ్రీలు, కడెం పెద్దూర్‌లో 16.3, మామడ మండలం పొన్కూర్ 17.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలో మూడ్రోజులుగా చలి తీవ్రత అధికంగా ఉంటోంది. గ్రామాల్లో రాత్రి 8గంటలు దాటితే జనసంచారం తగ్గి రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉదయం కూడా చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. ఉదయం 9గంటలు దాటినా చలి ప్రభావం తగ్గడం లేదు. వేకువజామున పంటలను మార్కెట్‌కు తీసుకువెళ్లేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలు చలి నుంచి ఉపశమనం పొందేందుకు చలిమంట వేసుకుంటున్నారు.

మరింత పెరిగే అవకాశం

మూడ్రోజులుగా పెరుగుతున్న చలి రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కురిసిన అకాల వర్షాలు చలి తీవ్రతకు కారణమవుతున్నాయి. వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల కారణంగా వైద్యులు పలు సలహాలు ఇస్తున్నారు. వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు అత్యంత జాగ్రత్తగా ఉండటం తప్పనిసరి అని హెచ్చరిస్తున్నారు. వేడి పదార్థాలు మాత్రమే ఆహారంగా తీసుకోవాలని, ఎప్పటికప్పుడు వంట చేసుకుని తినడం మేలని సూచిస్తున్నారు.

లక్ష్మణచాంద మండలంలో..

లక్ష్మణచాంద: మండలాన్ని మంగళవారం మంచు దుప్పటి కప్పేసింది. ఉదయం ప్రజలు బయటికి వెళ్లేందుకు ఇబ్బంది పడ్డారు. పంట పొలాలను పొగమంచు కమ్మేసింది. రోడ్లపై వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలు సమీపానికి వచ్చేదాకా కనిపించక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



నిర్మల్ రూరల్ మండలం కొండాపూర్ జాతీయరహదారి 61పై పొగమంచు

కుంటాలలో..

కుంటాల: మండలంలో అత్యల్పంగా 7.0 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఆయా గ్రామాల్లో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వృద్ధులు, చిన్నారులు చలి తీవ్రతతో ఇబ్బంది పడ్డారు. పలు గ్రామాల్లో ప్రజలు చలిమంట వేసుకుని చలి నుంచి ఉపశమనం పొందడం కనిపించింది.



కుంటాల: మండల కేంద్రంలో చలిమంట కాగుతున్న గ్రామస్తులు

వణుకుతున్న పల్లెలు



మామడ మండలం తాండ్రలో నేషనల్ హైవేను కమ్ముకున్న పొగమంచు

మామడ: మండలంలో చలి పెరుగుతోంది. కనిష్ట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. సోమవారం రాత్రి 8గంటలకు 'సాక్షి' బృందం మండలంలోని గుట్టల మీది గిరిజన గ్రామాలైన రచ్చకోట, గోండుగూడ, తోటిగూడ గ్రామాలను సందర్శించింది. చలి, ఈదురు గాలులతో వ్యవసాయ పనులకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బంది పడ్డారు. సాయంత్రం 6గంటల వరకు ఇళ్లకు చేరుకుంటున్నారు. ఉదయం 8గంటల వరకు కూడా ఇళ్ల నుంచి బయటకు రాని పరిస్థితి నెలకొంది. గిరిజనులు రాత్రి వేళ చలి నుంచి రక్షణకు ఇళ్ల వద్ద మంటలు వేస్తూ చలికాగుతున్నారు.

కమ్ముకున్న పొగమంచు

మండలంలోని గుట్టల మీది గ్రామాల్లో ఉదయం పొగమంచు కమ్ముకుంది. ఉదయం 9 గంటల వరకు కూడా ప్రజలు ఇళ్ల నుంచి రాలేదు. పొగమంచు కారణంగా జాతీయ రహదారిపై ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

రోజువారీ పనులు చేసుకోలేకపోతున్నం



ఈ ఏడాది చలి ఎక్కువగా ఉంది. రోజువారీ పనులు సకాలంలో చేసుకోలేక పోతున్నం. రాత్రిపూట ఇంటి వద్ద మంట వేసుకుని ఉపశమనం పొందుతున్నం. చలి కారణంగా ఉదయం 8గంటల వరకు బయటకు వస్తలేము.

– నక్కుబాయి, గోండుగూడ



జిల్లా కేంద్రంలో చలిలో విధులకు హాజరైన పారిశుధ్య కార్మికులు



మామడ మండలం రచ్చకోటలో మంట కాగుతున్న గ్రామస్తులు



జిల్లా కేంద్రంలోని శాస్త్రీనగర్‌లో చలికి ముడుచుకు కూర్చున్న కోతులు



తోటిగూడలో ఇంట్లో మంట కాగుతున్న వృద్ధులు

ఎట్టకేలకు ప్ర'యోగం'..

- కాలేజీ అకౌంట్లలో నిధులు
- రూ.25వేల చొప్పున జమ

నిర్మల్‌ఖిల్లా: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ సెకండియర్ విద్యార్థులకు ఫిబ్రవరిలో ప్రాక్టికల్స్ వార్షిక పరీక్షలు నిర్వహించనున్నారు. అయితే ఇప్పటివరకు ఆయా కళాశాలల్లో ప్రయోగ పరికరాలు, రసాయనాలకు సంబంధించి బడ్జెట్ రాకపోవడంతో ప్రాక్టికల్ క్లాసులు నిర్వహణలో జాప్యం జరిగింది. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం, ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆయా కళాశాలల అకౌంట్లకు నిధులు జమ చేసింది. మరోవైపు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు రానున్న వార్షిక పరీక్షల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడానికి ప్రస్తుతం 90 రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు. ఎంపీసీ, బైపీసీ చదువుతున్న విద్యార్థులకు సంబంధిత సబ్జెక్టుల అధ్యాపకులు ప్రయోగాలపై అవగాహన కల్పించడంతోపాటు ప్రాక్టికల్స్ తరగతులు నిర్వహించనున్నారు. వీటితోపాటు సంబంధిత విషయాలవారీగా రికార్డు బుక్కులనూ రాయిస్తున్నారు.



రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడంలో చేసిన జాప్యం కారణంగా నెలన్నర కాలంలో ప్రాక్టికల్స్ తరగతులు పూర్తిచేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. రానున్న వార్షిక ప్రయోగ పరీక్షల సమయంలో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు.

నిధుల విడుదలలో జాప్యంతోనే..

జిల్లాలో 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలుండగా, 2,200 మందికి పైగా ద్వితీయ సంవత్సరం అభ్యసిస్తున్నారు. సెకండియర్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో 30 మార్కుల చొప్పున ప్రయోగ పరీక్షలుంటాయి. వీటికోసం సంబంధిత సబ్జెక్టు అధ్యాపకులు విద్యార్థులను సన్నద్ధం చేయాల్సి ఉంటుంది. డిసెంబర్ వరకు నిధులు విడుదల చేయకపోవడంతో ఇప్పటి వరకు కొన్ని కళాశాలల్లో ప్రాక్టికల్స్ తరగతులు మొదలుకాలేదు. మరికొన్ని చోట్ల సంబంధిత అధ్యాపకులు, ప్రిన్సిపాల్‌లు అవసరమైన రసాయనాలు, ప్రయోగ పరికరాలను సొంత ఖర్చులతో తెప్పించి తరగతులు నిర్వహించారు. తాజాగా ప్రాక్టికల్స్ నిర్వహణ ఖర్చులకు ఒక్కో కళాశాల అకౌంట్‌లో రూ.25 వేలు జమ చేసినట్లు జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు.

తరగతులు నిర్వహిస్తాం



ప్రయోగశాలల నిర్వహణ నిధులు ఇటీవలే విడుదల య్యాయి. జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ప్రాక్టికల్స్ తరగతులు నిర్వహిస్తాం. ఇందుకు వారిని సన్నద్ధం చేస్తున్నాం.

– జాదవ్ పరశురాం, జిల్లా ఇంటర్‌విద్యాధికారి, నిర్మల్

పెన్షనర్ల హక్కులను పరిరక్షిస్తాం

నిర్మల్‌చైన్‌గేట్: పెన్షనర్ల హక్కులను పరిరక్షిస్తామని కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో నిర్వహించిన జాతీయ పెన్షనర్ల దినోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ కార్మికులు, విశ్రాంత ఉద్యోగులను కలెక్టర్, అధికారులు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్ యాక్ట్ ద్వారా హక్కులు, రక్షణ పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘ భవనం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి రూ.5 లక్షలు కలెక్టర్ మంజూరు చేసినట్లు పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంసీ లింగన్న తెలిపారు.



మున్సిపల్ కార్మికులను సన్మానిస్తున్న కలెక్టర్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక, డీటీవో సరోజ, ఆర్డీవో రత్నకళ్యాణి, ఎస్టీవో రమేశ్, తహసీల్దార్ రాజు, సంఘం ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

'డబుల్' నిర్మాణాలపై నివేదిక ఇవ్వాలి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో చేపట్టిన డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలపై తహసీల్దార్లు, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో ఆమె సమావేశమై మాట్లాడారు. జిల్లాకు మంజూరైన డబుల్ బెడ్రూం ఇళ్లు, పరిపాలన అనుమతులు పొందినవి, పూర్తయినవి, నిర్మాణ దశలో ఉన్న వాటిపై సమగ్ర నివేదికలు అందించాలని సూచించారు. ఇప్పటివరకు లబ్ధిదారులకు అందించిన డబుల్ బెడ్రూం ఇళ్లలో విద్యుత్, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్నకళ్యాణి, పంచాయతీరాజ్ ఈఈ శంకరయ్య, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

సారంగపూర్: సీఎం కప్ ఆటల పోటీల్లో మండలంలోని జామ్ గ్రామంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యార్థినులు సత్తా చాటారు. బేస్‌బాల్ పోటీల్లో గాయిత్రి, మౌనిక, మమత, సాయికీర్తి, సాఫ్ట్‌బాల్ పోటీల్లో గాయిత్రి, గౌతమి ఉత్తమ ఆటతీరు కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపాల్ సంగీత, పీఈటీ, పీడీలు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఉత్తమ ఆటతీరు ప్రదర్శించి పాఠశాలకు పేరు తేవాలని విద్యార్థినులకు వారు సూచించారు.



కుభీర్: ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

కుభీర్: మండలానికి చెందిన ఇద్దరు క్రీడాకారులు సీఎం కప్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు కుభీర్ ఉన్నత పాఠశాల పీడీ క్రాంతి తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో బాక్సింగ్‌లో శ్రీకాంత్, పవర్‌లిఫ్టింగ్‌లో ఎండీ జావెద్ మొదటి స్థానాల్లో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరిని పలువురు అభినందించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎస్వో శ్రీకాంత్‌రెడ్డి, సీజీఎఫ్ సెక్రటరీ రవీందర్‌గౌడ్, ఖోఖో సెక్రటరీ శ్రీధర్‌రెడ్డి తదితరులున్నారు.

బతుకమ్మ ఆడి నిరసన

నిర్మల్ రూరల్: డిమాండ్లు నెరవేర్చాలని సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్ష కొనసాగుతోంది. మంగళవారం మహిళా ఉద్యోగులు బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. జిల్లాలోని ఎంఈవోలు, సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కష్టారావు దీక్ష శిబిరాన్ని సందర్శించి వారికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తక్షణమే ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించి విద్యాశాఖలో విలీనం చేయాలని విజ్ఞప్తి చేశారు. వెట్టిచాకిరీ, శ్రమదోపిడీ నుంచి విముక్తి కల్పించాలని, న్యాయమైన కోర్కెలు తీర్చాలని డిమాండ్ చేశారు. దీక్ష శిబిరంలో నాయకులు గంగాధర్, రాజారత్నం, నరేశ్, హర్షద్, తిరుపతి, నాయక్, కవిత, రజిత, సంధ్య, వనిత, రమాదేవి తదితరులు కూర్చున్నారు.

కొనసాగిన సీఎం కప్ పోటీలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో రెండోరోజూ జిల్లాస్థాయి సీఎం కప్ పోటీలు కొనసాగాయి. మంగళవారం బాక్సింగ్, హ్యాండ్‌బాల్, నెట్‌బాల్, చెస్, తైక్వాండో, కరాటే పోటీలు నిర్వహించారు. జిల్లాలోని 18 మండలాల నుంచి 800 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అనంతరం నిర్మల్ స్పోర్ట్స్ అకాడమీలో నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీలను అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ప్రారంభించారు. ఇందులో 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ స్థాయి క్రీడాకారులను గుర్తించడమే సీఎం కప్ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. జిల్లా క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, ఎస్జీఎఫ్ సెక్రటరీ రవీందర్‌గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు భోజన్న, భూమన్న, బుచ్చి రామారావు, రమణారావు, స్వామి, భూమేశ్, జమున, విజయలక్ష్మి, రాజేందర్, కవిత, సంజీవ్ పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

క్లుప్తంగా

మహిళపై మెకం దాడి

పెంచికల్‌పేట్: మండలంలోని కోయ చిచ్చాల గ్రామానికి చెందిన మహిళా కూలీ కొడ్ప గంగుబాయిపై మెకం దాడి చేయడంతో గాయాలయ్యాయి. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కొత్త గూడకు చెందిన రౌతు పోశాలు పత్తి చేనులోకి మంగళవారం ఉదయం పత్తి ఏరడానికి సహచర కూలీలతో కలిసి వెళ్లింది. పత్తి ఏరుతుండగా వెనక నుండి పరుగెత్తుకుంటూ వచ్చిన మెకం తగలడంతో కింద పడిపోయింది. రెండు కాళ్ళతో మహిళను తొక్కడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన కూలీలు చికిత్స నిమిత్తం ముందుగా పీహెచ్‌సీకి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కొరకు కాగజ్‌నగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కూలీ పని చేస్తూ బతికే తమను అటవీశాఖ అధికారులు ఆదుకోవాలని బాధితురాలి భర్త కొడ్ప ముత్తయ్య వేడుకుంటున్నాడు.

కలప పట్టివేత


పట్టుకున్న కలపతో అధికారులు

సిరికొండ: మండలంలోని బోరింగ్ గూడలో అక్రమంగా నిల్వ ఉంచిన కలపను స్వాధీనం చేసుకున్నట్లు ఆదిలాబాద్ టాస్క్ ఫోర్స్ రేంజ్ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కలప విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందన్నారు. కలపను ఇచ్చోడ టింబర్ డిపోకు తరలించి బోరింగ్‌గూడకు చెందిన కినక గంగాప్రసాద్, కినక భీంరావ్, కినక అర్జున్, గుండాలకు చెందిన అర్షద్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

గంజాయి కేసులో ఇద్దరికి జైలు

ఆసిఫాబాద్: గంజాయి సాగు చేస్తున్న ఇద్దరు వ్యక్తులకు మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.25 వేల జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ తీర్పునిచ్చినట్లు జైనూర్ సీఐ రమేశ్ తెలిపారు. 2021 జూలై 28న లింగాపూర్ హెడ్ కానిస్టేబుల్ ఉద్ధవ్ సింగ్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా లింగాపూర్ మండలం వంజరిగూడకు చెందిన మావలే గోవింద్, దొడ్రం వద్ద గంజాయి లభించడంతో స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా ఇంటి వద్ద వ్యవసాయ క్షేత్రంలో గంజాయి సాగు చేస్తున్నట్లు ఒప్పుకున్నారు. జైనూర్ సీఐ హనూక్ ఇద్దరిపై ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచారు. పీపీ జగన్మోహన్‌రావు సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టగా నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

'దివ్యాంగులకు రిజర్వేషన్ అమలయ్యేలా చూడాలి'

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ, ప్రైవేటు శాఖల్లో ప్రస్తుతం అమలవుతున్న ఐదుశాతం రిజర్వేషన్‌ను దివ్యాంగులకు అమలయ్యేలా చూడాలని కోరుతూ దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్‌ఖాన్‌ను కలిసి విన్నవించారు. ఇటీవల బాధ్యతలను చేపట్టిన రౌఫ్‌ఖాన్‌ను దివ్యాంగులు మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలు పరిష్కరించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బూర్ల మహేందర్, రాచర్ల రాజయ్య, రమణి నరేశ్, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్ ఎక్కడ..?

- ఏళ్లు గడుస్తున్నా పట్టింపులేని వైనం
- ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో షాపులు కోల్పోయి నిరాశ్రయులైన మెకానిక్‌లు


రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జికింద మరమ్మతులకోసం నిలిపిన వాహనాలు

బెల్లంపల్లి: మోటారు వాహనాలను జీవనాధారం చేసుకుని బతుకుతున్న అసంఘటిత కార్మికుల పరిస్థితి అధ్వానంగా తయారైంది. రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో మెకానిక్‌లు షాపులు కోల్పోయి వీధినపడ్డారు. రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో నిరాశ్రయులైన మెకానిక్‌లు, అసంఘటిత కార్మికుల కోసం ఆటోనగర్ ఏర్పాటు చేసి పునరావాసం కల్పిస్తామన్న పాలకుల మాటలు నీటి మూటలయ్యాయి. ఏళ్లు గడుస్తున్నా కార్యరూపం దాల్చకపోవడంతో ఆటోనగర్ ఏర్పాటుపై ఆశలు వదులుకునే ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి.

రూ.3,100 లక్షల అంచనాతో...

హైదరాబాద్–చంద్రాపూర్ అప్పటి రాష్ట్రీయ ప్రధాన రహదారి, కాజీపేట్–బల్లార్షా సెక్షన్‌లో ఉన్న బెల్లంపల్లి–రేచినీ రైల్వేలైన్ కాల్‌టెక్స్ ఏరియాలో 2011లో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందుకోసం రైల్వే భద్రత నిధులు రూ.3,100 లక్షలు అవసరమని ప్రతిపాదించారు. టీ ఆకారంలో ఫ్లైఓవర్ బ్రిడ్జిని డిజైన్ చేశారు. 2011లో నిర్మాణ పనులు ప్రారంభించి 2015లో పూర్తి చేశారు. 2015 జూన్ 5న అప్పటి రోడ్లు భవనాలు, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు.

బ్రిడ్జి నిర్మాణంతో...

రవాణా సౌకర్యం కోసం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంతో కాల్‌టెక్స్ ఏరియాలో అప్పటి వరకు మోటారు వాహనాల మీద ఆధార పడిన మెకానిక్‌లు, వెల్డర్లు, ఇతర అసంఘటిత కార్మికులు వీధి పాలయ్యారు. బ్రిడ్జి నిర్మాణంతో షాపులను కోల్పోయి గూడు చెదిరి పోయిన పక్షుల మాదిరి చెల్లాచెదురయ్యారు. అప్పటి వరకు కళకళలాడిన కాల్‌టెక్స్ ప్రాంతం కళావిహీనంగా మారింది. ఈ క్రమంలో కొంతమంది బతుకుదెరువును వెతుక్కుంటూ ఇతరప్రాంతాలకు వలసవెళ్లగా ఏ ఆధారం లేని అసంఘటిత కార్మికులు గదులు అద్దెకు తీసుకుని దినచర్య మొదలుపెట్టారు. ఒక్కో గదికి కనిష్టంగా రూ.5 వేల నుంచి గరిష్టంగా రూ.10 వేల వరకు అద్దె చెల్లిస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణంతో దాదాపు 150 నుంచి 200 మంది వరకు నిరాశ్రయులు కాగా కొంతమంది మరో మార్గం లేక బ్రిడ్జి క్రింద మోటారు మరమ్మతు పనులు నిర్వహిస్తున్నారు.

తొమ్మిదేళ్లు కావస్తున్నా..

రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో జీవనాధారం కోల్పోయిన మోటారు వాహనాల రంగంలో పని చేస్తున్న కార్మికులకు ఆటోనగర్ నిర్మించి బతుకుదెరువు కల్పిస్తామని అప్పటి పాలకులు హామీ ఇచ్చారు. పాలకులు మారుతున్నా నేటికీ ఆటోనగర్ ఏర్పాటుకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఆటోనగర్ ఏర్పాటు కోసం గంగారాంనగర్/కన్నాల శివారులో ఉన్న రెండెకరాల ప్రభుత్వ భూమిని కేటాయిస్తామని ప్రగల్భాలు పలికి గాలికి వదిలేశారు. దీంతో ఐదేళ్ల కోసారి ఎన్నికల వేళ ఆటోనగర్ ప్రస్తావన రావడం కొంతకాలం నుంచి పరిపాటిగా మారగా ఇంతవరకు ఎలాంటి పురోగతి లేకుండా పోయింది.

బతుకుదెరువు పోయింది



రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో మా బతుకుదెరువు పోయింది. సొంతంగా ఏర్పాటు చేసుకున్న షాపులు కోల్పోయాం. ఏ ఆధారం లేక అద్దెకు గదిని తీసుకుని మెకానిక్ పనులు చేస్తున్నా. చేసిన కష్టం అద్దె చెల్లించడానికి కూడా సరిపోని పరిస్థితి.

– ఎస్‌కే బాబా, ఆటోమెకానిక్, బెల్లంపల్లి

గిరాకీ తగ్గింది



బ్రిడ్జి నిర్మాణంతో మాకు గిరాకీ రావడం లేదు. లారీలు, ఇతర వాహనాలు బ్రిడ్జి కిందికి రాకుండా నేరుగా వెళ్లిపోతున్నాయి. అతి కష్టంగా కుటుంబాలు నెట్టుకొస్తున్నాం. ఏళ్ల తరబడి నుంచి పనిచేస్తున్నా మా బతుకుల్లో ఎలాంటి మార్పురావడం లేదు.

– సంకరి పోశం, లారీ మెకానిక్, బెల్లంపల్లి

ఆటోనగర్ ఏర్పాటు చేయాలి



రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ముందు మంచిర్యాల–ఆసిఫాబాద్ వైపు నిత్యం రాకపోకలు సాగించే వాహనాలను కాల్‌టెక్స్‌లో ఆగి మరమ్మతు చేయించుకుని వెళ్లేవారు. బ్రిడ్జినిర్మాణంతో ఉపాధి కరువవుతోంది. ఆటోనగర్ నిర్మించి పునరావాసం కల్పించాలి.

– హనీఫ్, లారీడ్రైవర్, బెల్లంపల్లి

చేపల వాహనంలో మద్యం తరలింపు


పోలీసులు పట్టుకున్న వాహనం

జైపూర్: ముదిరాజులకు చెందిన చేపల వాహనంలో అక్రమంగా మద్యం తరలిస్తుండగా జైపూర్ పోలీసులు పట్టుకున్నారు. జైపూర్ మండలం ఇందారం నీలిమ వైన్స్ నుంచి బెల్ట్‌షాపులకు అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లుగా వచ్చిన సమాచారం మేరకు బ్లూకోర్టు పోలీసులు వాహనాన్ని పట్టుకున్నారు. ఇందారం నుంచి టేకుమట్ల బెల్ట్‌షాపులకు మద్యం తరలిస్తున్నట్లు వాహన డ్రైవర్ తెలిపారు. కాగా బెల్ట్‌షాపులకు అక్రమంగా మద్యం రవాణాచేసి అధిక ధరలకు విక్రయిస్తున్నపటికీ సంబంధిత ఎక్సైజ్‌శాఖ అధికారులు పట్టింపు చేయడం లేదని, కొన్ని గ్రామాల్లో ఏకంగా బెల్ట్‌షాపుల నిర్వహణకు టెండర్లు సైతం నిర్వహించి వైన్‌షాపు మాదిరి అమ్మకాలు సాగిస్తున్నారని స్థానికులు వాపోయారు.

క్రికెట్‌లో ఉమ్మడి జిల్లా జట్టు ప్రతిభ


గెలుపొందిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు

మంచిర్యాలటౌన్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రికెట్ అండర్–14 జట్ల ఎంపిక పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు ప్రతిభ కనబర్చింది. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న పోటీల్లో రాష్ట్రస్థాయి పోటీల్లో మొదటి రౌండ్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు 27 ఓవర్లలో 132 పరుగులు చేయగా కరీంనగర్ జట్టు 22 ఓవర్లలో 73కు ఆలౌట్ అయ్యింది. కరీంనగర్ జట్టుపై 60 రన్స్‌తో గెలుపొంది రెండో రౌండ్‌కు వెళ్లినట్లు కోచ్ ప్రదీప్ తెలిపారు.

రాష్ట్రస్థాయి సెమినార్‌కు ఎంపిక


మునీందర్ రాజు

నిర్మల్‌ఖిల్లా: ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో ఈనెల 21న హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి గణిత సెమినార్‌కు నిర్మల్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మునీందర్ రాజు ఎంపికయ్యాడు. జిల్లా కేంద్రంలోని ఈద్గాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న రాజు గణితం నేర్చుకునే విధానాలపై రాసిన పరిశోధన వ్యాసం రాష్ట్రస్థాయిలో ఎస్సీఈఆర్టీ ఎంపిక చేసింది. పీఆర్టీయూ నాయకులు తోట నరేంద్ర బాబు, రమణారావు, బల్సి గజ్జారాం, ప్రధానోపాధ్యాయులు నీరజ రాణి, తదితరులు అభినందించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


ఆసిఫాబాద్‌అర్బన్: శ్రీకాంత్‌తో అధ్యాపక బృందం


ఆసిఫాబాద్‌రూరల్: అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మహేశ్వర్

ఆసిఫాబాద్‌అర్బన్: ఈ నెల 19 నుంచి 23 వరకు జమ్మూకశ్మీర్‌లో జరుగనున్న 37వ సబ్ జూనియర్ జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి శ్రీకాంత్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ యాదగిరి తెలిపారు. ఇటీవల మెదక్ జిల్లా ముసాయిపేట్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో కాంస్య పతకం సాధించి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. మంగళవారం పాఠశాల అధ్యాపక బృందం సదరు విద్యార్థిని అభినందించింది. కార్యక్రమంలో రహీం, రాజ్‌కుమార్, సట్ల శంకర్, కోట, యాదగిరి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ పోటీలకు ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మహేశ్వర్ తెలిపారు. మంగళవారం పాఠశాల ఆవరణలో పీడీ తిరుపతితో కలిసి విద్యార్థులను అభినందించారు. ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో అనూష, రోహన్ ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఈ నెల 25, 26 తేదీల్లో ఛత్తీస్‌గఢ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

గద్దెను ఢీకొట్టిన డీసీఎం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంచిర్యాల చౌ రస్తా వద్ద గల గద్దెను మంగళవారం భారీ డీసీఎం వాహనం ఢీకొట్టింది. దీంతో గద్దె కొంతమేరకు ధ్వంసమైంది. భైంసా పట్టణం నుంచి హైదరాబాద్‌వైపు వెళ్తున్న వాహనం సిగ్నల్ వద్ద మూలమలిపే క్రమంలో అదుపుతప్పి గద్దెను ఢీకొట్టింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


యశ్వంత్‌రావ్ (ఫైల్)

బజార్‌హత్నూర్: మండలంలోని పిప్పిరి గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కొత్తపల్లి గ్రామానికి చెందిన దుర్వ యశ్వంత్‌రావు (22) ద్విచక్ర వాహనంపై ఇచ్చోడ నుంచి బజార్ హత్నూర్‌కు వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టాడు. తీవ్రగాయాలు కావడంతో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించి చికిత్స అందించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై అప్పారావు తెలిపారు.

ఆటో ఢీకొని ఒకరు ..


శ్రీనివాస్ మృతదేహం

రెబ్బెన: మండలంలోని నక్కలగూడ బస్‌స్టాప్ సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి ఆటో ఢీకొని ఒకరు మృతి చెందినట్లు ఎస్సై డీ.చంద్రశేఖర్ తెలిపారు. ఆసిఫాబాద్ మండలంలోని పర్సనంబాలకు చెందిన చౌదరి శ్రీనివాస్ (36) రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తుండగా మంచిర్యాల నుంచి కౌటాలకు వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108కు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

ఆదిలాబాద్‌టౌన్: బాలికను వేధించిన ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ఆసిఫ్‌పై పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. గత కొన్ని రోజులుగా ప్రేమ పేరిట వేధిస్తున్నాడని బాలిక కుటుంబ సభ్యులకు చెప్పడంతో నిందితుడిపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పేదలకు ఉచిత న్యాయసేవలు


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి అర్పిత

జైపూర్: 60ఏళ్లు పైబడిన నిరుపేదలకు ఉచితంగా న్యాయ సేవలు అందిస్తామని సీనియర్ సివిల్ జడ్జి మారంరెడ్డి అర్పిత తెలిపారు. టేకుమట్ల, భీమారం మండల కేంద్రంలో గల రైతు వేదికలో మంగళవారం రైతులకు న్యాయవిజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, నిరుపేద ప్రజలకు ఉచితంగా అందిస్తున్న న్యాయ సేవలను వినియోగించుకోవాలన్నారు. న్యాయ సలహాలు, సూచనలు కావాల్సినవారు 15100 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు అత్తె సుధాకర్, మార్క్‌గ్లాస్టన్, ఆయా గ్రామాల రైతులు, ఎరువుల దుకాణాల నిర్వాహకులు పాల్గొన్నారు.

సమ్మెలోనే సీఆర్టీలు


ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్న సీఆర్టీలు

- రెండోరోజుకు నిరవధిక సమ్మె
- ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఆందోళన

నార్నూర్: ఐటీడీఏ పరిధిలోని పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న సీఆర్టీలు తమ సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 16 నుంచి ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేపట్టారు. తమ డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేస్తున్నారు. సీఆర్టీలు సమ్మెకు దిగడంతో ఏజెన్సీ ప్రాంతంలోని ఏకోపాధ్యాయ పాఠశాలలు తెరుచుకోలేదు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 123 ఆశ్రమ పాఠశాలలు, 904 గిరిజన ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. అందులో 1200 మంది సీఆర్టీలు విధులు నిర్వహిస్తున్నారు.

డిమాండ్లు ఇవే..

- ఐదు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలి.
- మినిమం టైం స్కేల్ తో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలి.
- సర్వీస్‌లను క్రమబద్ధీకరించాలి.
- ప్రతీనెల ఒకటో తేదీన గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలి.
- మహిళా సీఆర్టీలకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు వర్తింపజేయాలి.
- పీఎఫ్ సౌకర్యం కల్పించాలి.
- రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.20 లక్షలు అందించాలి.
- హెల్త్‌కార్డు సౌకర్యం కల్పించాలి.

ఉద్యోగ భద్రత కల్పించాలి



దాదాపు 15 ఏళ్లుగా ఆశ్రమ పాఠశాలలో సీఆర్టీ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నా. ఉద్యోగ భద్రత లేకపోవడంతో భయంగా ఉంది. నెలనెలా వేతనం రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారుతోంది. ఉద్యోగ భద్రత కల్పించాలి.

– ఉపేందర్, సీఆర్టీ

నెలనెలా వేతనం అందించాలి



నెలనెలా వేతనం రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారుతోంది. అప్పులు చేయాల్సిన పరిస్థితి దాపురిస్తోంది. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు ప్రతీనెల ఒకటవ తేదీన గ్రీన్ ఛానల్ ద్వారా వేతనం అందించాలి.

– ముకుందరావు, సీఆర్టీ

బినామీ రుణాలపై పోలీసుల ఆరా!

- బ్యాంకు సిబ్బంది హస్తంపై అనుమానాలు

చెన్నూర్: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో ఫీల్డ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న చెన్నూర్ మండలం కత్తెరశాలకు చెందిన చల్లా ప్రవీణ్‌రెడ్డి బినామీ పేరుతో రుణాలు కాజేసిన వైనంపై పోలీసులు ఆరా తీసినట్లు తెలిసింది. కిష్టంపేట, కత్తెరశాల గ్రామాల్లో ఎవరు, ఎవరి పేరున ఎంత కాజేశారు.. అనే కోణంలో పోలీసులు సమాచారం సేకరించినట్లు సమాచారం.

బ్యాంకర్లపై అనుమానాలు

ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో పనిచేసే ఫీల్డ్ ఆఫీసర్ రుణాల కోసం సిఫార్సు చేయడమే అతని విధులు. రుణాలు ఇవ్వాలా? వద్దా? అనేది మేనేజర్ చేతిలోనే ఉంటుంది. రూ.10 వేల రుణం ఇవ్వాలన్నా సవాలక్ష డాక్యుమెంట్స్ పరిశీలించి పది నుంచి పదిహేను పేపర్లపై సాక్షుల సంతకాలు తీసుకుంటారు. సదరు యజమాని ఇంటిని పరిశీలించి రుణం మంజూరు చేస్తారు. సదరు యజమాని ఖాతాలోనే నగదు జమ చేస్తారు. కానీ ఇక్కడ బ్యాంక్ నుంచి తీసుకున్న రుణం యజమాని ఖాతాలో కాకుండా బినామీ పేరున డబ్బులు జమచేసి కాజేశారు. ఈ వ్యవహారంలో బ్యాంకర్ల హస్తం ఉంటుందని మండలంలో చర్చ కొనసాగుతోంది. అంతేకాకుండా మృతి చెందిన వ్యక్తి పేరున రుణం మంజూరు చేసి బాధిత కుటుంబ సభ్యులకు డబ్బులు ఇవ్వకుండా సదరు ఫీల్డ్ ఆఫీసరే కాజేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. బతికి ఉన్న వ్యక్తికే రుణాలు ఇవ్వాలనే బ్యాంక్‌లు మృతుని పేరున రుణం మంజూరు చేశారంటే ఇందులో బ్యాంకర్ల పాత్ర కీలకంగా ఉందని పుకార్లు వినిపిస్తున్నాయి. ఇందులో ప్రధాన సూత్రదారిగా ఉన్న ప్రవీణ్‌రెడ్డి ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. అతను బయటకు వస్తేనే నిజానిజాలు వెలుగులోకి రానున్నాయి.

గుట్టు చప్పుడు కాకుండా పంచాయితీ

కిష్టంపేట గ్రామానికి చెందిన మృతుడు రవీందర్ రెడ్డి పేరున ప్రవీణ్‌రెడ్డి బినామీ పేరుతో రూ.25 లక్షల రుణం మంజూరు చేయించి కాజేసినట్లు తెలిసింది. దీంతో మృతుని కుటుంబం మాకు తెలియకుండా రుణం ఎలా తీసుకుంటారని ప్రవీణ్‌రెడ్డి కుటుంబాన్ని ప్రశ్నించారు. ఇటీవల గ్రామంలో పంచాయితీ కూడా పెట్టినట్లు తెలిసింది. సదరు నగదు ఇస్తామని పెద్ద మనుషుల మధ్య ప్రవీణ్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఒప్పుకున్నట్లు తెలిసింది.

క్రీడారంగ అభివృద్ధికి చర్యలు


బాస్కెట్‌బాల్‌ను త్రో చేస్తున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్


యోగాసనాలు వేస్తున్న క్రీడాకారులు

మంచిర్యాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగ అభివృద్ధికి అనేక చర్యలు చేపడుతోందని, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో సీఎం కప్–2024 జిల్లాస్థాయి క్రీడా పోటీలను కలెక్టర్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. రాష్ట్రస్థాయిలోనూ జిల్లా క్రీడాకారులు రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. పోటీల్లో పలువురు యోగా విన్యాసాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో రాజ్‌వీర్, డీఈవో ఎస్.యాదయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, జిల్లా షెడ్యూల్డ్ కులాల ఉపసంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరి, జిల్లా సంక్షేమశాఖ అధికారి రౌఫ్‌ఖాన్, రవాణాశాఖ అధికారి సంతోశ్‌కుమార్ పాల్గొన్నారు.

'అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి'


మాట్లాడుతున్న తోకల సరస్వతి

పాతమంచిర్యాల: అంగన్‌వాడీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) జిల్లా కార్యదర్శి తోకల సరస్వతి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రిటైర్మెంట్ బెనిఫిట్ టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష చెల్లించాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం టీచర్‌కు రూ.26 వేలు, ఆయాలకు రూ.18 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఏఐటీయూసీలో చేరగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కుసుమ, భూపతిరావు రమాదేవి, నేరెళ్ల అరుణ, తిరుమల, కాంత, శంకరమ్మ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, సీపీఐ పట్టణ కార్యదర్శి ఖలిందర్ అలీఖాన్, తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు అవగాహన


పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు

భీమిని: కన్నెపల్లి మండలంలోని రెబ్బెనలో మంగళవారం జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శంకర్ పశువులకు ఉచిత గర్భకోశ, చికిత్సలపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఇరవై పశువులకు గర్భకోశ చికిత్సలు, ముప్పై దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారులు సంపత్, సతీష్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ రవి, సురేష్, పాడి రైతులు పాల్గొన్నారు.